క్లుప్తంగా

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ ఉచిత శిక్షణ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో శుక్రవారం నుంచి సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఏపీ ఈఏపీ సెట్ (ఎంసెట్) ఉచిత శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, కరస్పాండెంట్ చెరువు రామకష్ణ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని వారు సూచించారు. ఇతర వివరాలకు 79936 99955, 83329 11155 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు ధర్మజ్యోతి పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళా వేదికపై స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ధర్మజ్యోతి 2023 పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొరప్రాటి రామారావు, తూనుగుంట్ల సుందరరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో గుమ్మడి రమేష్ చంద్ర 'ధర్మజ్యోతి 2023' పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్‌కు చెందిన షేక్ షబియాకు క్రెడిట్ కార్డు ఉంది. ఈనెల 29న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి కార్డు ఉపయోగిస్తున్నారా? అని అడిగాడు. ఉపయోగించడం లేదని చెప్పింది. దీనివల్ల అదనపు చార్జి పడుతోందని, అవి పడకుండా చేస్తానని చెప్పి నమ్మించాడు. దీంతో ఆమె ఓటీపీ చెప్పింది. అనంతరం షబియా అకౌంట్‌లోని రూ. 35వేలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీనుల విందుగా నవరత్న కీర్తనలు



పాత గుంటూరు: లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం వేదికగా శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకురాలు ఏ. భారతీదేవి ఆధ్వర్యంలో అనఘా హైమా బృందం 108వ రామపునర్వసు, శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామునిపై నవరత్న కీర్తనలను ఆలపించింది. సుమారు వంద మందికి పైగా గాయకులు వీనుల విందుగా ఆలపించి అలరించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట రంగనాయకి వ్యాఖ్యానం చేశారు. కార్యక్రమాన్ని సంఘం ప్రధాన కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు, వల్లూరి కిశోర్, గిరిజా శంకర్ పర్యవేక్షించారు.

స్వచ్ఛ మాషల్ మార్చ్



ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: నగరంలోని గౌతమబుద్ధా రోడ్‌లో గురువారం నగరపాలక సంస్థ అధికారులు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు స్వచ్ఛ మాషల్ మార్చ్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ర్యాలీని అడిషనల్ కమిషనర్ హేమమాలిని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వ్యర్థాలను వేరు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ మార్చ్ నిర్వహించినట్లు వివరించారు. నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డు మీదుగా సాగిన ర్యాలీ అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బంది మానవ హారం నిర్వహించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, శానిటేషన్ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు కేఎల్‌యూలో బిజినెస్ స్కూల్ ఫెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని(బిజినెస్ ఫెస్ట్) 'ట్రాక్ష్యా' అనే అంశంతో నిర్వహించనున్నట్లు ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమ దివ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా ట్రాక్ష్యాను నిర్వహిస్తున్నామని, ఈ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా టెక్ మహేంద్రా దక్షిణ భారత దేశ అధిపతి శ్రీనివాసరెడ్డి, గౌరవ అతిథిగా ఎంటర్‌పెన్యూర్ విజయరాఘవులు విచ్చేయనున్నారని వివరించారు. ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ వంటి అంశాల్లో నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి విద్యార్థులకు ఇది అద్భుత అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన రామాలయాలు

ప్రత్తిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో రామనామ స్మరణ మార్మోగిపోయింది. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ప్రత్తిపాడులోని రెడ్ల రామాలయం వద్ద రాములవారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దంపతులు కల్యాణ వేడుకల్లో పీటల మీద కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు, బెల్లంలను ప్రసాదంగా ఇచ్చారు. అంతే కాకుండా గ్రామంలోని రజకుల రామాలయం, యాదవుల రామాలయం, శాలివాహన రామాలయం, నాయుళ్ల రామాలయం, వేణుగోపాలస్వామి దేవాలయం, తిక్కిరెడ్డిపాలెం రామాలయంతో పాటు పలు రామమందిరాల్లో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా దేవాలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం నూతన వధూవరులను గ్రామోత్సవం జరిపారు. తదనంతరం నవదంపతులు గ్రామంలో ప్రత్యేక వాహనంపై పురవీధులలోనికి తరలివచ్చారు. భక్తులు స్వామి వారికి వారులు పోసి హారతులిచ్చారు.

భారీ అన్నదానం..

శ్రీరామనవమి సందర్భంగా యనమదలలో కాకతీయ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేశారు. గత కొద్ది సంవత్సరాలు ఏటా శ్రీరామనవి నాడు కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహిస్తున్నారు.

నేడు యనమదలలో తిరునాళ్ల..

కల్యాణోత్సవం మరుసటి రోజు గ్రామస్తులు తిరునాళ్లను జరుపుకొంటారు. ఈతిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి రకరకాల కలప, చెక్కలు, చెక్క సామగ్రి, తరలివస్తాయి. అందువలన గతంలో ఈ తిరునాళ్లకు కలప తిరునాళ్లగా పేరు ఉండేదని పూర్వీకులు చెప్తున్నారు. వీటినన్నింటిని దృష్టిలో ఉంచుకుని స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలి వచ్చే భక్త జన సందోహానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు: సీతారాముల వారి కల్యాణం వైభవంగా, కమనీయంగా జరిగింది. గురువారం ఉదయం శ్రీరామనవమి సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రాములవారి కల్యాణం ఘనంగా జరిపించారు. రామాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ తాటాకు పందిరి కింద ప్రత్యేకంగా అలంకరించిన వేదికలపై సీతారాములవారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేద పండితులు కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ఈ కల్యాణాన్ని గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాకుమానులో...

కాకుమాను: మండంలోని గ్రామాలలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని కొమ్మూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మేళ తాళాల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దంపతులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పొన్నూరులో...

చేబ్రోలు: శ్రీరామనవమి వేడుకలు పొన్నూరు మండల పరిధిలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పొన్నూరు మండల పరిధిలోని మన్నవ గ్రామంలో చెన్నకేశవ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి, స్థానిక నాయకులు, భక్త బృందం పాల్గొన్నారు. పొన్నూరు పట్టణ పరిధిలోని తెలగపాలెం రామ మందిరం నందు శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, చైర్మన్ అల్లం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. పొన్నూరు పట్టణ పరిధిలోని సాయి నగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రోత్సవాలను స్థానిక భక్త బృందం నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. సేవా మండలి చైర్మన్ ఏఆర్‌కేఎస్వీ సాయి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం, వేజండ్ల, మంచాల, శలపాడు, వడ్లమూడి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో, మంచాల గ్రామంలోని కోదండ రామస్వామి దేవాలయంలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణాన్ని కనుల పండుగా నిర్వహించారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం మాదిరిగా సీతారామస్వామి దేవస్థానంలో నవానీకదీక్షలతో పూజకార్యక్రమాలు నిర్వహించారు. వేజండ్ల కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎదురుకోల కన్నుల పండుగగా జరిగింది. శలపాడులోని సీతారామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. మంచాల గ్రామంలో కల్యాణోత్సవం అనంతరం కల్యాణమూర్తుల గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా ..

గుంటూరు రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా వాడవాడలా శ్రీరాముని కల్యాణ మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. గురువారం మండలంలోని గ్రామ, గ్రామాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణాలు నిర్వహించారు. చిన్నపలకలూరు గ్రామంలోని రామాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి నాగరాజు, ముల్లపూడి వెంకటేశ్వర్లు, తోట నాగేశ్వరరావు, వాసా సత్యనారాయణ, తోట శేషగిరి, తోట బాలకృష్ణ, తోట సుబ్బారావు, నరేష్ పాల్గొన్నారు.

అంకిరెడ్డిపాలెంలో ఉత్సవమూర్తి ఊరేగింపు..

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అంకిరెడ్డిపాలెం గ్రామంలోని కోదండరామాలంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదం అన్నదానం చేశారు. రాత్రి కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల కోలాటం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆలయ భజన కమిటీ మహిళల భజనా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపాలెంలో స్వామివారి ఉత్సవమూర్తి ఊరేగింపులో చిన్నారుల కోలాటం



వేణుగోపాల, సీతారామస్వామి దేవస్థానంలో రాములవారికి పూజలు



మన్నవలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



నాగులపాడు రామాలయంలో శ్రీరామ కల్యాణంలో పాల్గొన్న దంపతులు



కొమ్మూరులో స్వామివారి దంపతులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడు రెడ్ల రామాలయం వద్ద కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మంచాలలో సీతారాముల కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం

కనుల పండువగా సీతారాముల కల్యాణం

పెదకాకాని: శ్రీరామనవమి పర్వదినాన్ని మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి శోభాయమానంగా అలంకరించారు. ఆయా గ్రామాలలో ఉన్న రామాలయాల వద్ద, శ్రీరామ నవమి వేడుకలు జరుపుకొనేందుకు ఏర్పాటు చేసిన పందిళ్లలో శ్రీ సీతారాముల కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువులో పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు జరిపించారు. ఆలయాలు, చలువ పందిళ్ల భక్తులతో కళకళలాడాయి. స్వామవారికి భక్తిశ్రద్ధలతో పొంగలి నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ పానకం, వడపప్పు, ప్రసాదాలు పంపిణీ చేశారు. పెదకాకాని మండల పరిధిలోని



నంబూరులో జరిగిన శ్రీరామనవమి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

నంబూరు జయభారత రెడ్డినగర్, వైశ్యాబ్యాంక్ బజారులోని రాములవారి గుడిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, లక్ష్మీసరస్వతి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు గోత్రనామ పూజలు జరిపించారు. శ్రీరామనవమి సందర్భంగా పలు ఆలయాల వద్ద అన్న సంతర్పణ జరిగింది. ఆలయాలు రాత్రి వేళలలో విద్యుత్ కాంతులతో కళకళలాడాయి.

ఏసు ప్రభు చూపిన మార్గంలో నడుద్దాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పారుపల్లి(క్రోసూరు): ఏసు ప్రభు చూపిన శాంతి, దయ, ప్రేమ మార్గాల్లో నడిస్తే అందరూ ఆనందంగా ఉంటారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పారుపల్లి గ్రామంలో రక్షణ సువార్త పండుగల(మతబోధనల కార్యక్రమాల)కు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు బాల స్వామి, జర్సన్ అబ్రహం, సిల్వన్, సుధీర్, కపాపాల్ పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పీసపాడు సర్పంచ్ రాజు, పారుపల్లి ముత్తయ్య, ఎంపీపీ పి.కోటయ్య, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి , ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, విప్పల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్షణ సువార్త సభలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

'ఆర్‌వీఆర్'లో హనీవెల్ మైక్రోసాఫ్ట్ శిక్షణ కార్యక్రమం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యంతో కూడిన విద్యను అందించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఆయా కోర్స్‌లలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణను అందిపుచ్చుకోవాలన్నారు. అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీ హనీవెల్ సహకారంతో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై 100 గంటల సర్టిఫికేషన్ కోర్సు ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించటం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కోర్స్‌లో చేరి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్, శేషగిరి, సత్తిబాబు, మల్లిఖార్జునరావు, ప్రశాంత్ తదితరులున్నారు.



కేఎల్‌యూ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు



బ్యానర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: భావ, భాష వ్యక్తీకరణ చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న నాయకత్వ లక్షణాలు వెలికి తీయవచ్చని కేఎల్ విశ్వవిద్యాలయ బీఏ ఐఏఎస్ విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ చెప్పారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర కుమార్ మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే జాతీయ స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ఫ్లాష్ మ్యాబ్‌ను నిర్వహించారని చెప్పారు. అనంతరం ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా విజయవాడకు వెళ్లి ట్రెండ్ సెట్ మాల్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, బిఏ ఐఏఎస్ విభాగ డిప్యూటీ అధిపతి డాక్టర్ అనిల్ విద్యార్థులను అభినందించారు.

నేడు వైఎస్సార్ 'ఆసరా' నగదు చెక్కుల పంపిణీ

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడుత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని.. 941 డ్వాక్రా సంఘాలకు రూ.6.44కోట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి అచ్చంపేట సచివాలయం 1, 2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు.

వైభవం.. వైకుంఠపురం వేంకటేశ్వరుని కల్యాణం



అమరావతి: దక్షిణాది వైకుంఠంగా పిలువబడే అమరావతిలోని వైకుంఠపురంలో వేంచేసియున్న పద్మావతి అలమేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, విశేష అలంకరణ గావించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం గ్రామ వీధుల్లో వైభవంగా నిర్వహించారు.

కల్లంలో మిర్చి మాయం

పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతు



యడ్లపాడు: రాసిపోసిన మిర్చిలో కొంత భాగంగా మాయమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు గ్రామానికి చెందిన మిర్చి రైతు కల్లూరి శ్రీనివాసరావు సుమారు 15 క్వింటాళ్ల మిర్చిని పొలంలో రాసిగా పోసి పరదా కప్పి ఉంచాడు. యడ్లపాడు పీహెచ్‌సీ వెనుక 16వ నంబర్ హైవే సర్వీసు రోడ్డుకు చేరుకునే ఈ డొంక మార్గంలో ఖాళీ ప్రదేశంలో ఉంచి గోతాల్లోకి తొక్కించేందుకు మిర్చిని ఉంచాడు. వీటి పక్కనే మరి కొన్ని టిక్కీలను పెట్టాడు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడికెళ్లి చూడగా పరదా చినిగి, వాటి పక్కనే మిర్చి చెల్లాచెదురుగా కనిపించింది. టిక్కీల్లో రెండు తగ్గడంతో అంతా పరిశీలించి చూశాడు. గుర్తుతెలియని దుండగులు అపహరణ చేసినట్టు గుర్తించి యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

సత్తెనపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన గోరంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మద్దిగుంట్ల రామారావు వ్యవసాయ పనుల నిమిత్తం రూ.1.50 లక్షలతో జత ఎడ్లను 20 రోజుల క్రితం కొనుగోలు చేశాడు. పొలంలో మేతకు వెళ్లి తిరిగి వస్తుండగా గారపాడు రోడ్డులోని పొలంలో రెండున్నర అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆకుల మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎద్దు వెళుతుండగా యజమాని దానిని పక్కకు అదిలించాడు. ప్రమాదకరంగా ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలను మార్చక పోవడంతో ఎద్దు మృతి చెందిందని, ఇది విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యవల్లే జరిగిందని రైతు రామారావు ఆందోళన వ్యక్తం చేశాడు.



మృతి చెందిన ఎద్దు వద్ద రైతులు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగుతుందని చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని 35 అంశాలపై చర్చించి, ఆమోదించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియోగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరుకానున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికారులు, హాజరుకావాలని పేర్కొన్నారు.

వడ్డీ లేకుండా పన్నులు చెల్లింపులకు నేడే ఆఖరి రోజు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ఆస్తి పన్నులు చెల్లింపులు చేసేందుకు శుక్రవారం ఆఖరు రోజు కావడంతో నగరపాలక సంస్థ అధికారులు క్యాష్ కౌంటర్ల సమయం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.ఇందులో భాగంగా ఉదయం 8గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పాటు అదనంగా భారత్‌పేట 140వ వార్డు సచివాలయం, వసంత రాయపురం 148వ వార్డు సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106వ వార్డు సచివాలయంలో కూడా పన్నులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

నగరంలో 1,92,666 అసెస్‌మెంట్లు

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,92,666 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి రూ.146.29 కోట్లు డిమాండ్ కాగా గురువారం సాయంత్రం రూ.114 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.32 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా దీనిలో అన్ కలెక్టబుల్ డిమాండ్ సుమారు రూ.20 కోట్లకు పైగా ఉంది. గత సంవత్సరం ఇదే మార్చి 31వ తేదిన ఒక్కరోజే రూ.4.30 కోట్లు వసూలు చేశారు. నేడు ఆఖరు రోజు కావడంతో సుమారు రూ.5 కోట్లు పైగా వసూలు అవుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు.